## తప్పుచెయ్యని దోషి

పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ టేబుల్‌మీద గడ్డం ఆన్చి కూర్చుని ఆవేశంతో ఆలోచనల్తో మండుతున్నాడు. కళ్ళు ఎర్రబారి వున్నాయి. నిన్న జరిగిన సంఘటన అతనికి 'చెంప దెబ్బ'లా వుంది. 'డర్టీ బాస్టర్డ్ జాకీ' అమ్మాయిల్ని వేధిస్తుంటే రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాడు తను వాణ్ణి. కానీ గంటలోనే హోమ్ మినిస్టర్ దగ్గర్నించి ఫోను తెప్పించుకుని విడుదలై వెళ్ళిపోయాడు. ఈ దేశంలో బ్యూరోక్రసీ రాజకీయాలు కర్తవ్య నిర్వహణలో అడ్డు తగుల్తాయని తెలుసుకానీ తట్టుకోలేక పోతున్నాడు.

ఇంతలో కానిస్టేబుల్స్ కామేశం, ఇస్మాయిల్ ఓ పన్నెండేళ్ళ కుర్రాణ్ణి చెరో రెక్కా పట్టుకు లాక్కొచ్చారు. వాడు మాసిన గుడ్డలతో దరిద్రానికి నిర్వచనంలా వున్నాడు. బెదురు కళ్ళతో తోడేలు ముందు నిల్చున్న కుందేలు పిల్లలా వున్నాడు. "సార్! వాడు ఈగల్ బేకరీలో బ్రెడ్ దొంగతనం చేసాడు సార్! ఆ కుర్రాడు రిజర్వు బ్యాంకు దోచినంత ఘోరంగా చెప్పాడు ఇస్మాయిల్. ప్రదీప్ వాడికేసి తీక్షణంగా చూసాడు. వాడి శరీరం ఒక్కసారి వణికింది. "తప్పయింది సార్! రెండు రోజుల్నించి కూలిపని దొరకలేదు. ఆకలేసింది" దుఃఖంతో వాడి గొంతుపూడిపోయింది. కళ్ళు కన్నీటి కొలనులయ్యాయి. ప్రదీప్ ఓ క్షణం ఆలోచించాడు.

ఐదు నిమిషాల తర్వాత తను తెప్పించిన సమోసాలు తింటూ టీ త్రాగుతూ తన ఎదురుగా కుర్చీలో కూర్చున్న ఆ కుర్రాడ్ని సంతోషం వెలిగే కళ్ళతో చూస్తున్నాడు ప్రదీప్. ఆనందం నిండిన గుండెతో ఇలా అనుకున్నాడు. 'ఒళ్ళు పొగరెక్కి నేరం చేసిన వాడ్ని తను శిక్షించలేనప్పుడు ఆకలికోసం చిన్న నేరం చేసిన వాణ్ణి తను దండించక్కరలేదు. పైగా తప్పుని ఒప్పుకున్నాడు కూడా. జాకీలాంటి వాళ్ళని శిక్షించే అవకాశం అధికారం తనకెప్పుడొస్తుందో అప్పుడే తను ఇలాంటి కుర్రాణ్ణి శిక్షించగలడు. తన పరిధిలో తను ఇలా చెయ్యడంలో తప్పులేదు,

— తనికెళ్ళ శంకర్

ఈ బహుమతి పొందిన కథలలో మీకు నచ్చిన కాలమ్ దాటని కథ వివరాలు ఈ కూపన్‌లో నింపి మా కార్యాలయానికి పంపండి.

- ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన కాలమ్ దాటని కథ - - - - - - - - - - - - - - - -

రచయిత/రచయిత్రి - - - - - - - - - - - - - - - - - - - - - - -

పేజీ నంబరు : - - - - - - - - - - - - - - - - - - - - - - -

## లాస్ట్ బాల్

ప్రసాద్ హనీమూన్ వెళ్ళి తిరిగొచ్చాడని తెలిసి వాళ్ళింటి కెళ్ళాను. సాదరంగా ఆహ్వానించాడు. పెళ్ళికి రానందుకు దెప్పి పొడిచాడు. పెళ్ళి విశేషాలు వివరంగా, హనీమూన్ విశేషాలు క్లుప్తంగా చెప్పాడు. వాళ్ళ శ్రీమతిని పిలిచి పరిచయం చేశారు. పలకరింపుల తర్వాత ఆమె లోపలికి పోయి టీ తెచ్చిచ్చి మళ్ళీ లోపలికి పోయింది. కాసేపయ్యాక వాడి దగ్గర శెలవు తీసికొని ఇంటి దారి పట్టాను. ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

వాడెందుకు ఇంతతొందరపడ్డాడు? మంచి వుద్యోగం వచ్చిం తర్వాత కూడా నాలుగు సంవత్సరాల కాలంలో ఇరవై మూడు సంబంధాలు చూసి ఒక్కటీ నచ్చలేదన్నాడు. తను పెళ్ళి చేసికొనే అమ్మాయి అర్హతల, అభిరుచుల చెక్ లిస్ట్ ముందే తయారు చేసికొని ఏ ఒక్కటి లోపించినా ఆ సంబంధాన్ని తిరస్కరించేవాడు. వాడి స్పెసిఫికేషన్స్‌లో అతి ముఖ్యమైనవే లేని ఈ అమ్మాయిని ఎందుకు చేసుకున్నట్లు? అదే మాట వాడి నడిగితే నవ్వి వూరుకున్నాడు.

* * *

ఓ స్సారి మా కాలేజి టీమ్‌కి ఓ లోకల్ టీమ్‌కి క్రికెట్ మ్యాచ్ జరిగింది. కాలేజి టీమ్‌లో ప్రసాద్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్. బ్యాటింగ్ ప్రారంభించేందుకు వచ్చిన ప్రసాద్ ఓసారి ఫీల్డర్లందర్నీ కలియ చూశాడు. ప్రతి బాల్‌ని ఎంతో పరిశీలనగా చూస్తూ మొదటి ఓవర్ పూర్తి డిఫెన్స్ ఆడాడు. కాసేపు తర్వాత రెండో ఓవర్‌ను ఎదుర్కొన్నాడు. అవతలి బ్యాట్స్‌మన్ బౌండరీలు కొడుతున్నా బ్యాడ్ బాల్ వచ్చేంత వరకూ హిట్ చేయకూడదన్న ఉద్దేశంతో వున్న వాడిలా ఆ ఓవర్ కూడా డిఫెన్స్ ఆడాడు... ఒక్క పరుగూ చేయలేదు. అతను ఎదుర్కొన్న మూడో ఓవర్ కూడా మైడెనే. అతనికది నాలుగో ఓవర్... ప్రతి బాల్‌ను కొడుతూనే వున్నాడు... కాని బంతి సరాసరి ఫీల్డర్ల దగ్గరి కెళుతోంది. ఫీల్డింగు బాగుంది. ఫీల్డ్ ప్లేస్‌మెంట్ మరీ బాగుంది. ఒక్క పరుగైనా చేస్తానో లేదో అన్న ఆందోళన అతని ముఖంలో కన్పిస్తున్నది.

ఆ ఓవర్‌లో అది చివరి బాల్. సహనానికే నీరసం వచ్చినట్లు కన్పిస్తోంది. లాస్ట్ బాల్... వేగంగా... బలంగా... క్రూరంగా... మొరటుగా... వూపాడు. అంతే స్టంప్‌లు గాల్లోకి లేచాయి!

* * *

అత్రుత కొద్దీ ఆడవాళ్ళూ, అలసిపోయి మగవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుంటారని ఆస్కార్ వైల్డ్ చెప్పినట్లు ఎక్కడో చదివిన విషయం గుర్తుకొచ్చింది. అలసిపోయినప్పుడూ, సహనం కోల్పోయినప్పుడూ తీసికొనే నిర్ణయాలు ఇలానే వుంటాయి కాబోలు!

—శేషశాయి

## లంచానికి లంచం

ఆ వంతెన బలహీనంగా వుంది. అది ఒట్టి వం[తెన] కాదు. వంతెనతోటి రిజర్వాయరు. వేలకొలది ఎకరాల[కు] నీరు సరఫరా చేస్తుంది. దాదాపు 100 సంవత్సర[ాల] క్రితం బ్రిటిషు వారు కట్టించింది. వంతెన బలహీనం[గా] వుండడం వలన ప్రభుత్వం వారు బరువులతో గ[ల] వాహనాల రాకపోకలు నిషేధించారు. బస్సులయి[తే] మనుష్యులను దించేసి ఖాళీవి, లారీలయితే బరువుల[ను] దించేసి ఖాళీవి అనుమతిస్తారు. అందుకే సాధారణంగా లారీలు బరువులతో ఆ లైను రావు. ఒక వేళ వచ్చినా సామానులను దించేసి కూలీలచే మోయించి అవత[లి] ఒడ్డున మరల లారీ లోడ్ చేస్తారు.

రాత్రి రెండు గంటల సమయం.

పెద్ద లోడ్‌తో ఒక లారీ వచ్చి వంతెన ముందు ఆగింది. డ్యూటీలో వున్న వాచ్‌మేన్ లారీ దగ్గరకు వచ్చి -"సైడ్ తీసి ఆపవయ్యా, బరువులు మొయ్యడానికి యిప్పుడు కూలివారు ఎవరు లేరు. ఉదయం వెళ్ళ[వ]చ్చు" అన్నాడు.

"ఉదయమా?! అంతవరకే! ఈ లోడ్ వేగం వైజాగ్ చేరాలి" అన్నాడు లారీ డ్రైవరు.

"వేగమంటే ఎలాగయ్యా, ఎవరూ కూలివాళ్ళు లేరు. అందరూ ఊళ్ళోకి పోయారు."

"బాబ్బాబు" బతిమాలసాగాడు లారీ డ్రైవరు.

"బతిమాలితే పన్లు కావయ్యా. ఓ రెండు వంద[లు] లియ్యి. గప్‌చిప్‌గా లారీ లోడ్‌తో వదిలేస్తాను."

"రెండు వందలా?" ఆశ్చర్యంగా అన్నాడు డ్రైవర్.

"నేనేమీ ఎక్కువడగలేదయ్యా. పైగా రిస్క్. ఎవ[ ]రైనా చూశారంటే నా ఉద్యోగం ఊడిపోతుంది."

"సరే" అంటూ రెండు వందలిచ్చి లారీ స్టార్ట్ చేశాడు డ్రైవరు. సరిగ్గా వంతెన మధ్యగా ఆపాడు లారీని.

"ఏవయ్యా సగంలో ఆపేశావ్?" పరుగున లారీ దగ్గరకు వచ్చి అడిగాడు వాచ్‌మేన్.

"నాలుగు వందలిస్తే గాని కదలనంటుందయ్యా ఈ లారీ" చెప్పాడు డ్రైవర్.

"నాలుగు వందలా?!" ఆశ్చర్యంగా నోరు తెరిచాడు వాచ్‌మేన్.

"నాలుగు వందలివ్వకపోతే లారీ కదలదు. లారీ కదలకపోతే మీ పై ఆఫీసర్లు చూస్తే నీ ఉద్యోగం గోవిందా!" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ లారీ డ్రైవర్.

చేసేదిలేక వచ్చినట్టు నాలుగు వందలిచ్చాడు వాచ్‌మేన్. డబ్బులు జేబులో పెట్టుకుని, ఈల వేసుకుంటూ హుషారుగా స్టార్ట్ చేసి వేగం వెళ్ళిపోయాడు లారీ డ్రైవర్.

"అమ్మా కంత్రీ నా కొడకా! ఈరోజు సంపాదనంతా కొట్టేశావ్ కదరా" తిట్టుకున్నాడు వాచ్‌మేన్.

- గుండ్రెడ్డి భాస్కరరావు